# సాక్షి నారాయణపేట

శుక్రవారం । 19 । జూలై । 2024






**బదిలీల్లో గోల్‌మాల్!**
ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.
వివరాలు 8లో ▸



**3డే లీగ్‌లో సంచలనం**
హెచ్‌సీఏ 3డే లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు సంచలన విజయం సాధించింది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
26.7 /23.5

**వాతావరణం**
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'కొడంగల్' పురోగతిపై సీఎం సమీక్ష



**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** కొడంగల్ – నారాయణపేట –మక్తల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన ప్రాజెక్ట్‌ల సమీక్ష సందర్భంగా వెల్లువెత్తిన అంశాలపై చర్చించారు. పాలమూరు జిల్లాలో సాగు నీటి ప్రాజెక్ట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని.. పక్కా ప్రణాళికతో పూర్తి చేసేలా ముందుకు సాగాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై ఇక నుంచి ప్రతి నాలుగు వారాలకోసారి రివ్యూ చేస్తానని సీఎం వెల్లడించినట్లు సమాచారం. అదేవిధంగా కొడంగల్‌లో ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించడంతో పాటు మద్దూరు రెసిడెన్షియల్ క్యాంపస్ నిర్మాణంపై పలు సూచనలు చేశారు.

### డీఎస్సీ పరీక్షలు ప్రారంభం



**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు చేపట్టిన డీఎస్సీ- 2024 పరీక్ష గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు జిల్లాకేంద్రంలో అధికారులు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ విధానంలో రెండు షిఫ్టులలో పరీక్షలు జరిగాయి. జిల్లాకేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో ఉదయం షిఫ్ట్‌లో 184 మంది అభ్యర్థులకు గాను 166 మంది హాజరవగా 18 మంది గైర్హాజరయ్యారు. అలాగే రెండో షిఫ్ట్‌లో 184 మందికి 160 మంది హాజరవగా 24 మంది గైర్హాజరయ్యారు. జేపీఎన్‌సీఈలో ఉదయం షిఫ్ట్‌లో 180 మంది అభ్యర్థులకు 158 మంది హాజరవగా.. 22 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్టులో 180 మందికి 163 మంది హాజరవగా.. 17 మంది గైర్హాజరయ్యారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలను ఎస్పీ జానకి, డీఈఓ రవీందర్ తనిఖీ చేశారు.

### కల్వకుర్తి @ 3వ స్థానం..

రూ.లక్ష రుణమాఫీలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం మూడో స్థానంలో నిలిచింది. ఈ సెగ్మెంట్‌లో 17,270 రైతు కుటుంబాలకు చెందిన 18,196 మంది రైతులకు రూ.103.02 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని అందోల్ మొదటి స్థానంలో నిలవగా.. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం రెండో స్థానం దక్కించుకుంది.

### 51,417 మందిలో 20,130 మందికే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పరిధిలో 22 బ్రాంచ్‌లు ఉన్నాయి. ఈ బ్యాంక్‌ల పరిధిలో మొత్తం 68,495 మంది రైతులు రూ.476.84 కోట్ల రుణాలు తీసుకున్నారు. ఇందులో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న వారు 51,417 మంది రైతులు కాగా.. వీరికి రూ.236.54 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. గురువారం రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేయగా.. సదరు జాబితా అధికారులకు అందింది. ఇందులో 20,130 మంది రైతులకు రూ.92.02 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి.

# రైతుకు రుణ విముక్తి

## జిల్లాలో 28,684 మందికి.. రూ.165 కోట్లు విడుదల



పేట సత్యనారాయణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి వీసీని వీక్షిస్తున్న రైతులు, కాంగ్రెస్ శ్రేణులు

**జిల్లాలో రూ.లక్ష లోపు రుణ మాఫీ వివరాలిలా..**

| మండలం | రైతుల సంఖ్య |
|---|---|
| మద్దూర్ | 4,317 |
| కోస్గి | 4,054 |
| నారాయణపేట | 3,908 |
| మక్తల్ | 2,669 |
| ఊట్కూర్ | 2,557 |
| దామరగిద్ద | 2,359 |
| ధన్వాడ | 2,274 |
| మరికల్ | 2,258 |
| నర్వ | 2,065 |
| మాగనూర్ | 1,231 |
| క్రిష్ణ | 992 |

- రుణమాఫీతో రైతుల్లో ఆనందం
- ఊరు.. వాడా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- ధన్వాడ రైతుతో వీసీలో ముచ్చటించిన సీఎం రేవంత్‌రెడ్డి

**ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి రాములు. ఇతని నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని యంనోనిపల్లి. ఈయనకు ఐదు ఎకరాల పొలం ఉండడంతో మరికల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ. 70 వేల రుణం తీసుకున్నాడు. ప్రతి ఏడాది తీసుకున్న డబ్బులను రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. రుణం ఒకేసారి మాఫీ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీతో వచ్చిన డబ్బులను పంట పెట్టుబడులకు ఉపయోగించుకుంటానని చెప్పుకొచ్చారు.**



నారాయణపేట: రైతుకు రుణ విముక్తి లభించింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రుణమాఫీ చేశారు. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్లు జమ చేస్తున్నట్లు రైతు వేదికల్లో నిర్వహించిన వీసీల్లో రైతులతో నేరుగా సీఎం మాట్లాడుతూ రైతు రుణమాఫీ పథకాన్ని ప్రారంభించారు. దీంతో రైతుల్లో ఆనందం.. కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. ఆగస్టు 15 లోగా రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మేరకు ఈ ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంది. రుణభారం నుంచి విముక్తి లభించడంతో జిల్లాలోని రైతాంగం, కాంగ్రెస్ శ్రేణులు ఊరువాడల్లో హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకొన్నారు. తొలి రోజు లక్ష లోపు రుణాలు 28,684 మంది రైతులకు రూ.165.45 కోట్లు రుణాలు మాఫీ అయ్యాయి.



**13 రైతు వేదికల్లో వీక్షించిన రైతులు**

జిల్లాలో 77 క్లస్టర్లలో రైతు వేదికలు ఉండగా.. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను జిల్లాలోని 13 రైతు వేదికల్లో ఏర్పాటు చేశారు. సింగారం, బాపన్‌పల్లి , లింగాల్‌చేడు, గూండుమాల్, చంద్రవంచ, గడ్డంపల్లి, మాగనూర్, మూడుమాల్, కోల్లూర్, నర్వ, కన్మనూర్, ధన్వాడ, మద్దూర్‌లలోని రైతు వేదికల్లో రైతులు పాల్గొని సీఎం రుణమాఫీ పథకం ప్రారంభిస్తు.. రైతుల ముచ్చటించడాన్ని వీక్షిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

### రూ.90 వేలు మాఫీ అయ్యాయి



రెండేళ్ల కింద పంట రుణం ధన్వాడ ఏపీజీబీ బ్యాంకులో రూ. 90 వేలు తీసుకున్నా. రుణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో మాఫీ చేయడం సంతోషంగా ఉంది. మాలాంటి పేద రైతులకు సరైన న్యాయం జరిగింది.

– వడ్ల రాములు, రైతు, పూసలు పహాడ్ , మరికల్ మండలం

### మరో రాజశేఖరుడు.. రేవంతన్న

గతేడాది రూ.80 వేల రుణం బ్యాంకు ద్వారా తీసుకున్నా. సీఎం రేవంత్‌రెడ్డి రుణ విముక్తి కలిగించారు. గతంలో మహానేత వైఎస్.రాజశేఖర రెడ్డి 2004లో మాఫీ చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మాఫీ చేసి మరో రాజశేఖరుడు అయ్యారు.

– బడే సాబ్, రైతు, కన్మనూర్, మరికల్ మండలం

## రేపు కోస్గి కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



వానాకాలంలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో శనివారం కోస్గి మున్సిపల్ కమిషనర్ శశిధర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. పురపాలిక పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య చర్యలపై ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. అలాగే ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం నిండిపోవడం, డ్రైయినేజీ, రోడ్లు సరిగా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. వాటి పరిష్కారం కోసం కమిషనర్ సమాధానమిస్తారు.



శశిధర్, మున్సిపల్ కమిషనర్, కోస్గి

**ఫోన్ చేయాల్సిన నంబర్: 94402 12124**

**తేదీ:** 20.7.2024 శనివారం, **సమయం:** ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

## దేశానికే రోల్ మోడల్ తెలంగాణ

- రుణమాఫీ చరిత్రలో నిలిచిపోతుంది
- 'పేట' ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి



ధన్వాడలో ఎడ్లబండి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట/ధన్వాడ/మరికల్: ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తామని హామీ ఇచ్చి.. మాట మేరకు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, ఇప్పుడు రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వాగ్దానం మేరకు రుణవిముక్తి కల్పించారని.. ఇది దేశ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, అలాగే ధన్వాడలో జరిగిన వీసీ, మరికల్‌లో బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం రోల్ మాడల్‌గా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలో 82.24 కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. దీంతో పల్లె, పట్టణాల్లో పండుగా వాతవరణం కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి దశల వారీగా చేసిందన్నారు. అయినా లక్ష వరకు రుణమాఫీ చేయకపోవడంతో ఎన్నికల్లో రైతులే గుణపాఠం చెప్పారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో రుణమాఫీని ఏకకాలంలో చేసిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే సారి చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క, , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు రుణమాఫీ చేసేందుకు రాత్రింబవళ్లు ఎంతో కష్టపడ్డారన్నారు. కొడంగల్, మక్తల్, నారాయణపేట ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమన్నారు. త్వరలోనే టేండర్లు పూర్తి అయి పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఆస్పత్రుల్లో మేరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్‌కుమార్, మార్కెట్ మాజీ చైర్మన్లు సుధాకర్, సరాఫ్‌నాగరాజు, సలీం పాల్గొన్నారు.

### ఎద్దుల బండి పై ర్యాలీ, సంబరాలు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణవిముక్తి కల్పిస్తూ ఏకకాలంలో రూ. 2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో గురువారం స్థానిక ఎమ్మెల్యేడాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఎద్దుల బండి పై ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. ఈ ర్యాలీ సత్యనారాయణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వీసీ దగ్గరకు చేరుకుంది. ఎమ్మెల్యే అక్కడి నుంచి ధన్వాడ రైతు వేదికకు బయలుదేరారు. కార్యకర్తలు, రైతులు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి వీసీని వీక్షిస్తూ సంబరాలు జరుపుకున్నారు.

# రూ.1,120.74 కోట్లు

**తొలి విడతలో పంట రుణ మాఫీ మొత్తం • ఉమ్మడి జిల్లాలో 2,01,102 మంది రైతులకు లబ్ధి**

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తొలి విడతలో రూ.లక్ష లోపు పంట రుణాల మాఫీకి సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 1,91,519 కుటుంబాల్లోని 2,01,102 మంది రైతులకు లబ్ధి చేకూరింది. మొత్తం రూ.1,120.74 కోట్ల పంట రుణాలు మాఫీ కాగా.. సదరు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమయ్యాయి. పంట రుణాల్లో అత్యధికంగా రుణమాఫీ అయిన నియోజకవర్గాల్లో కల్వకుర్తి రూ.103.02 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉండగా.. ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రూ.99.84 కోట్లతో కొడంగల్, రూ.92.44 కోట్లతో అచ్చంపేట నియోజకవర్గాలు వరుసగా రెండు, మూడో స్థానాలను దక్కించుకున్నాయి. ఇందులో మహబూబ్‌నగర్ నియోజకవర్గం చివరి స్థానంలో నిలిచింది.

**ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా రూ.లక్ష లోపు రుణమాఫీ వివరాలు.. (రూ.కోట్లలో)**

| నియోజకవర్గం | రుణమాఫీ అయిన | | మాఫీ చేసిన |
|---|---|---|---|
| | కుటుంబాలు | రైతులు | సొమ్ము |
| కల్వకుర్తి | 17,720 | 18,196 | 103.02 |
| కొడంగల్ | 16,989 | 17,975 | 99.84 |
| అచ్చంపేట | 15,112 | 15,990 | 92.44 |
| కొల్లాపూర్ | 15,998 | 16,982 | 91.58 |
| దేవరకద్ర | 15,698 | 16,621 | 87.94 |
| వనపర్తి | 15,180 | 16,071 | 83.84 |
| అలంపూర్ | 13,799 | 14,299 | 82.81 |
| నారాయణపేట | 14,004 | 14,774 | 82.24 |
| నాగర్‌కర్నూల్ | 13,610 | 14,348 | 81.75 |
| జడ్చర్ల | 13,663 | 14,349 | 80.09 |
| మక్తల్ | 11,658 | 12,107 | 72.75 |
| షాద్‌నగర్ | 12,741 | 13,462 | 70.31 |
| గద్వాల | 9,761 | 10,099 | 61.28 |
| మహబూబ్‌నగర్ | 5,586 | 5,829 | 30.85 |

## ఎమ్మెల్యే పర్ణికమ్మను మంచిగా చూసుకోండి..

- వీసీలో రైతు లక్ష్మితో ముచ్చటించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఇదిలాఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల రైతులతో గురువారం రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాసేపు ముచ్చటించారు. అందులో భాగంగా నారాయణపేట జిల్లా ధన్వాడ రైతు వేదిక నుంచి ధన్వాడ మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు కుర్వ లక్ష్మమ్మతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎన్ని ఎకరాల పొలం ఉంది, ఏఏ పంట సాగు చేస్తున్నారు, క్రాప్ లోన్ ఎంత ఉంది అని సీఎం లక్ష్మమ్మను అడిగి తెలుసుకున్నారు. తనతో స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రే మాట్లాడటంతో ఒకింత సంబరానికి లోనైన లక్ష్మమ్మ మూడు ఎకరాలలో పత్తి సాగు చేస్తున్నానని, ఒక ఎకరాలో వరి సాగు చేస్తున్నానని, తనకు రూ.75 వేల క్రాప్ లోన్ ఉందని, నేటితో అది మాఫీ అయిందని సీఎంకు సంతోషంగా తెలిపింది. ఎందరో రైతులకు మేలు చేసే రైతు రుణమాఫీ అమలు చేసిన మీకు, మీ ప్రభుత్వానికి తాము ( రైతులందరం ) రుణపడి ఉంటామని ఆమె వీసీ ద్వారా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నాది ఏ ఊరు లక్ష్మమ్మ అనగా ఆమె ఆలోచనలో పడగానే పక్కనే ఉన్న కొడంగల్ అని సీఎం అన్నారు.. అవును సార్ నారాయణపేట జిల్లానే అని అనడంతో.. సరే లక్ష్మమ్మ మీ ఎమ్మెల్యే ఉందా అనడంతో.. ఇక్కడే ఉంది సార్ అని తెలిపింది. మీరు ఎమ్మెల్యే పర్ణికమ్మను మంచిగా చూసుకోండి అనడంతో రైతు వేదికలో అందరి మోముల్లో నవ్వులు కనిపించాయి. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, బ్యాంకు మేనేజర్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేని మంచిగా చూసుకోమని రైతు లక్ష్మమ్మతో సీఎం రేవంత్‌రెడ్డి అనడంతో దండంపెడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

## రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం



మక్తల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/నర్వ: రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్, నర్వలో కాంగ్రెస్ సంబరాలు నిర్వహించగా.. ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా మక్తల్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. ఇక నర్వలో రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు యాంకి నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బుల్లెట్ బైక్‌ను స్వయంగా నడుపుకుంటు కార్యకర్తలను,రైతులను ఉత్సాహపరుస్తూ నర్వ అంబెడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీని నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో నిలబెట్టుకొని రైతు ప్రభుత్వంగా నిలిచిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి అవిశ్రాంతంగా శ్రమిస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్న ప్రజాహిత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఏక కాలంలో రైతులకు ఆగస్టు 15 లోగా మూడు విడతల్లో రుణమాఫీ చేపట్టి తీరుతామన్నారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు నర్వ రైతువేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో నాయకులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, నాయకులు దేవరి మల్లప్ప, గోపాల్‌రెడ్డి, రవి కుమార్, రహింపటెల్, కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్, చెన్నయ్యసాగర్, జగన్‌మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'రుణమాఫీ' వంద శాతం పూర్తి చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలి
- జిల్లా స్థాయి బ్యాంకర్లతో కలెక్టర్ సిక్తా పట్నాయక్



బ్యాంకర్లు, వ్యవసాయ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ ద్వారా జమ అయ్యే రుణం గైడ్ లైన్స్ ప్రకారం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేరుగా రైతులకు చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల తో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ట్రైనీ కలెక్టర్ గరీమా నరులతో కలిసి రైతు రుణమాఫీ మార్గదర్శకాల అమలుపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా వేల కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తునట్లు ఆమె తెలిపారు. మొదటి విడతలో నారాయణపేట జిల్లాలోని 28684 మంది రైతులకుగాను రూ.165.45కోట్లు రుణ మాఫీ లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణమాఫీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా వారి రుణఖాతాలో జమ అయిన డబ్బులను నేరుగా రైతులకే అందేటట్లు చూడాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతు వేదికలో రైతుల జాబితాను ప్రదర్శించాలన్నారు. రైతులకు సంబంధించిన 1 బి, ఆధార్ కార్డు , భూమికి సంబంధించిన్ పాస్ పుస్తకం తదితర డాకుమెంట్స్ తీసుకొని రెన్యూవల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో కూడా రైతులకు సంబంధించి వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆమె ఆదేశించారు. 30 రోజుల పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతు రుణమాఫీ రైతులకు చేరేలా చూడాలన్నారు.

**పేర్లు రాని రైతుల వివరాలు తెలపండి**

లిస్టు లో రైతుల పేర్లు లేని యెడల జిల్లా వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆమె తెలిపారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రుణాలు తీసుకున్న రైతులకు ఆగస్టు నెలాఖరి వరకు రెండు లక్షల రుణమాఫీ వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు బ్యాంకు మేనేజర్లు ప్రస్తావించిన సమస్యలకు కలెక్టర్ పరిష్కార మార్గాలను సూచించారు. బ్యాంకులకు వచ్చే రైతుల పట్ల బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలని చెప్పారు. జిల్లాలో రైతు రుణ మాఫీని వంద శాతం పూర్తిచేసి రాష్ట్రస్థాయిలో జిల్లాను మొదటి వరుసలో ఉంచాలని ఈ సందర్భంగా బ్యాంకర్లను కలెక్టర్ కోరారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ రైతు రుణమాఫీ అమలు ఒక పండగ వాతావరణంలో కొనసాగేలా చూడాలని, మరీ ముఖ్యంగా ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని జిల్లా అనేది బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు గుర్తుపెట్టుకోవాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం విజయ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, ఆయా బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మొహర్రం వేడుకల్లో బాలిక అదృశ్యం


భాను (ఫైల్)

ఊట్కూర్: మొహర్రం వేడుకల్లో మండలంలోని మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన భాను(8) అదృశ్యమైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామ్మూర్తికి బాలు (10), భాను (8) ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం ఊట్కూర్‌లో మొహర్రం వేడుకలు చేసేందుకు పెద్దమ్మ బుజ్జమ్మతో కలిసి ఇద్దరు పిల్లలు వచ్చారు. సాయంత్ర వేళలో గాజులు వేసుకునేందు బాలికను తీసుకొని పెద్దమ్మ దుకాణం వెళ్లింది. కొంత సమయానికి బాలికకు గాజులు వేయించేందుకు వెతకగా కనపడలేదు. ఆమె వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు మొహర్రం వేడుకల్లో బాలిక ఆచూకీ కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎస్‌ఐ నవీద్‌ను వివరణ కోరగా, కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ పుటేజులను పరిశీలించగా ఓ మహిళ బాలిక చేయిపట్టుకొని తీసుకెళ్లినట్లు కనిపిస్తుందని తెలిపారు. కుటుంబ కలహాలతో బాలిక తల్లి అంజమ్మ రెండు ఏళ్లుగా భర్త, పిల్లలతో కలిసి ఉండడంలేదు. తల్లి అంజమ్మ బాలికను తీసుకెళ్లి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే బాలిక ఆచూకీ కోసం పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

### కోర్టు ఆదేశాలతో ఎస్‌ఐపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: కోర్టు ఆదేశాలతో మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐపై కేసు నమోదైంది. వివరాలిలా గతేడాది జూలై 20న నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు చెందిన కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణపై పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే అప్పటి ఎస్‌ఐ విజయ్‌కుమార్, కృష్ణారెడ్డిని పరుషపదజాలంతో దూషించడంతో పాటు కొట్టాడని నాగర్‌కర్నూల్ కోర్టులో ప్రైవేట్ కేసు వేశారు. విచారించిన జడ్జి ప్రస్తుతం మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ పని చేస్తున్న విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో గతనెల 29న కేసు నమోదు చేశారు. దీనిపై సీఐ కనకయ్యగౌడ్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్త, మరో నలుగురిపై కేసు

బల్మూర్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, మరో నలుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రేణయ్య తెలిపారు. మండలంలోని తుమ్మెన్‌పేట చెందిన రజితకు ఉప్పునుంతల మండలం కొరటికల్ చెందిన మొకుతాల గోపాల్‌తో మూడేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్తతో పాటు అత్త కళావతమ్మ, మామ తిరుపతయ్య, ఆడపడుచు అశ్విని, ఆమె భర్త కృష్ణయ్య రూ.3లక్షల అదనపు కట్నం తేవాలని రెండేళ్లుగా వేధిస్తుండడంతో సఖీ కేంద్రంలో ఫిర్యాదు చేసింది. వారికి కౌన్సెలింగ్ ఇప్పించినా మార్పు రాలేదని బాధితురాలు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

### పీర్ల పండుగలో అపశ్రుతి

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ గ్రామంలో గురువారం పీర్ల పండుగ నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో మతిస్థిమితం లేని యువకుడు బస్సు కిందపడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామన్‌గౌడ్ వివరాల ప్రకారం.. గోపులాపూర్ గ్రామానికి చెందిన మతిస్థిమితం సత్యాలు(25) పీర్లపండుగ ఊరేగింపులో ఉన్నాడు. ఆ సమయంలో వనపర్తి నుంచి గోపులాపూర్ మీదుగా కొల్లాపూర్ వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు రావడంతో అదుపు తప్పి బస్సు కింద పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ రామన్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

### ఇంట్లో గ్యాస్ లీకై మంటలు : ముగ్గురికి గాయాలు

గోపాల్‌పేట: ఇంట్లో గ్యాస్ సిలిండర్‌ను సరిచేస్తుండగా లీకై మంటలు చెలరేగడంతో ముగ్గురు గాయాలు పాలైన ఘటన మున్ననూరులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సోడె వెంకటయ్య, చిట్టెమ్మ దంపతులు సొంత గ్రామంలోనే వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరి ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రెండు రోజులుగా ఇంట్లో గ్యాస్ సిలిండర్ సమస్య ఉండటంతో గురువారం గ్రామానికి సిలిండర్లు డెలివరి చేసేందుకు వచ్చిన యువకుడు శంకర్‌కు తెలిపారు. ఆయన ఇంట్లో సిలిండర్‌ను పరిశీలించి నిప్పు అంటించేందుకు ప్రయత్నించగా అప్పటికే లీకై ఉండటంతో పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. దీంతో ఇద్దరు దంపతులతో పాటు శంకర్ గాయాలపాలయ్యారు. చుట్టుపక్కలవారు గమనించి ముగ్గురిని కారులో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ముగ్గురు పరిస్థితి విషమంగానే ఉందని తెలిసింది.

# బదిలీల్లో గోల్‌మాల్!


బదిలీల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో అవకతవకలు
- 20 రోజుల క్రితం స్పౌజ్‌ను తప్పుగా దరఖాస్తు చేసిన 15 మంది హెచ్‌ఎంలకు నోటీసులు
- నలుగురు ఎస్‌జీటీలకు సైతం గతంలో నోటీసులిచ్చిన వైనం
- తాజాగా ఎస్‌ఏ తెలుగు సీనియార్టీ జాబితా కమిటీలో మెంబర్‌కు నోటీసులు
- తప్పులపై వివరణ ఇవ్వాలని విద్యా శాఖ సూచన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలువురు ఉపాధ్యాయులకు సీనియార్టీ జాబితా, పీహెచ్ తదితర కేటగిరీల్లో దక్కాల్సిన పదోన్నతులు సైతం రాకపోవడంతో సంఘాల నాయకులు కలెక్టర్‌తో పాటు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్నిరోజులుగా జీహెచ్‌ఎంల బదిలీల్లో స్పౌజ్‌ను తప్పుగా వినియోగించారని వాటిని సరి చేయాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి. తాజాగా ఎస్‌ఏ తెలుగు సీనియార్టీ జాబితా కమిటీ మెంబర్‌కు కూడా గురువారం విద్యాశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో విద్యాశాఖలో జరుగుతున్న బదిలీలు, పదోన్నతులపై మరిన్ని అవమానాలు వ్యక్తమవుతున్నాయి. సీనియార్టీ జాబితా తయారు చేసే క్రమంలో ఉద్దేశపూర్వకంగా తప్పిదాలు చేశారా.. ఎందుకు చేశారు.. అనే అంశంపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

#### శాఖాపరంగా జారీచేశాం..



బదిలీలకు సంబంధించి సీనియార్టీ జాబితాలో తప్పులు దొర్లడంపై ఆరోపణలు రావడంతో వివరణ ఇవ్వాలని ఒక ఉపాధ్యాయుడికి శాఖాపరంగా నోటీసులు ఇచ్చాం. బదిలీలు, పదోన్నతుల్లో ఎవరికీ అన్యాయం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాం. ఎవరికైనా అన్యాయం జరిగి ఉంటే వాటిని సరిదిద్ది న్యాయం చేశాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

#### అన్యాయం జరగొద్దు



పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా చూడాలి. కొంత మందికి పదోన్నతుల్లో నష్టం జరిగింది. అలాగే బదిలీల్లో జరిగిన పొరపాట్లను సరిచేయాలి. పోస్టింగ్‌లు ఇవ్వని పీఈటీలు, ఎల్‌పీలకు పాఠశాలలను కేటాయించి ఇబ్బంది లేకుండా చూడాలి.

– శ్యాంబాబు, తెలంగాణ పీఆర్టీయూ, జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

కాగా జిల్లావ్యాప్తంగా మొత్తం 1,900 మంది బదిలీలు, పదోన్నతుల్లో పాల్గొన్నారు.

#### నోటీసుల పరంపర

విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులకు సంబంధించి వరుసగా నోటీసుల జారీ పరంపర కొనసాగుతుంది. 25 రోజుల క్రితం 15 మంది జీహెచ్‌ఎంలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. స్పౌజ్ పాయింట్ల కోసం దరఖాస్తు చేసుకుని వాటిలో భార్య/భర్త దగ్గర పాఠశాలను ఎంపిక చేసుకోకుండా హెచ్‌ఆర్‌ఏ స్థానానికి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో హైదరాబాద్ ఆర్జేడీ కార్యాలయం నుంచి నేరుగా వారికి నోటీసులు ఇచ్చారు. అనంతరం మూడురోజుల తర్వాత వాటికి వివరణ సైతం రాసి పంపారు. కానీ, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కొసమెరుపు. అంతేకాకుండా జడ్చర్ల మండలానికి సంబంధించి నలుగురు ఉపాధ్యాయులు సైతం తప్పుగా దరఖాస్తు చేశారని అధికారులు నోటీసులు ఇచ్చారు. గురువారం ఎస్‌ఏ తెలుగు సీనియార్టీ జాబితా కమిటీ మెంబర్‌కు కూడా అధికారులు నోటీసులు ఇచ్చారు. జాబితాలో తప్పులు దొర్లడానికి కారణాలపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.

## నవగ్రహాలు శుభస్థానంలో ఉంటేనే సత్ఫలితాలు

- దంపతులతో నవగ్రహసహిత నక్షత్ర హోమాలు
- కమనీయంగా శ్రీకాళచక్ర లక్ష దీపోత్సవం


శివపూజలు నిర్వహిస్తున్న భక్తులు


హోమంలో పాల్గొన్న భక్తులు

నాగర్‌కర్నూల్: నవగ్రహాలు అన్ని కుండలిలో శుభస్థానాల్లో ఉంటేనే మానవ జీవితం సాఫీగా నడుస్తుందని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ఈనెల 7 నుంచి 21 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం ఆయుత చండీ, అతి రుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా 11వ రోజు గురువారం 85 మంది దంపతులచే నవగ్రహ నక్షత్ర హోమాలు నిర్వహించారు. వేలాదిగా పాల్గొన్న మహిళలచే శ్రీకాళచక్ర లక్ష దీపోత్సవ సామూహిక దీపారాధన కనులవ పండువగా చేపట్టారు. గోచార రీత్యా ఉన్న నవగ్రహ దోషాలను తరచుగా ప్రత్యేక పూజలతో పరిహారం చేసుకోవాలని స్వామీజ అన్నారు. వేద బ్రాహ్మణులచే పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా నిత్య సామూహిక హోమాలలో భాగంగా సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాలు 21 మంది దంపతులతో నిర్వహించారు. ఉమామహేశ్వర పార్థీవ మృతిక పది వేల లింగాలకు పంచామృతాలతో అభిషేకం, బిల్వార్చన చేశారు. శ్రీచక్రాన్ని పంచామృత అభిషేకం, అర్చన చేసి, భక్తుల యొక్క కలహాబాధలు పోయి ధన, కనక, వస్తూ వాహనాలతో పుష్టిగా ఉండాలని అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శుక్రవారం ఉదయం అష్టలక్ష్మి సహిత చండీ హోమాలు, పుత్ర కామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు చండీ అమ్మవారికి లక్ష గాజుల అర్చన, మహిళలచే సామూహిక కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు


దిగువ జూరాల పవర్‌హౌజ్ కేంద్రంలోకి చేరుతున్న వరద నీరు

ధరూర్/ ఆత్మకూర్/ మదనాపురం/ దోమలపెంట: ఎగువ ప్రాంతంలో వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో కర్ణాటకలోని ఆల్మటి ప్రాజెక్టుకు వరద స్వల్పంగా తగ్గింది. గురువారం ప్రాజెక్టుకు 48,667 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. దిగువకు 65 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 98.729 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు స్థానికంగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి కలిపి 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో 22 క్రస్టు గేట్లను ఎత్తి 68,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 31.010 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 105, భీమా లిఫ్టు–1కు 300, లిఫ్టు–2కు 750, ఎడమ కాల్వకు 870, కుడి కాల్వకు 464, సమాంతర కాల్వకు 600, విద్యుదుత్పత్తి నిమిత్తం 25,174 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 30,013 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.760 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**395 మెగావాట్ల విద్యుదుత్పత్తి**

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు గురువారం 10 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 5 యూనిట్లలో 200 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 0.3319 మి.యూ., విద్యుదుత్పత్తి చేశామన్నారు. జూరాల కు పూర్తిస్థాయిలో వరద నీరు చేరిన తర్వాత 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడుతామని వివరించారు.

**శ్రీశైలంలో 806.6 అడుగులు**

శ్రీశైలం జలాశయంలో 806.6 అడుగుల వద్ద 32.3781 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం 6 గంటల సమయంలో జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 25,174 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,064 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 3.515 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 7,888 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 5.761 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 12,618 మొత్తం 20,506 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 51 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

**రామన్‌పాడుకు 513 క్యూసెక్కులు**

రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల సమాంతర కాల్వ ద్వారా 513 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రామన్‌పాడులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 840, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి చెప్పారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అడ్డాకుల: ఆర్థిక ఇబ్బందుల వల్ల జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌గౌడ్(58), లక్ష్మి దంపతులు. భార్య లక్ష్మికి వికలత్వం ఉండటంతో ఆసరా పింఛన్ వచ్చేది. ఇటీవల పింఛన్ రావడం నిలిచిపోయింది. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో భర్తతో గొడవ పడి లక్ష్మి వారం క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గు రైన లక్ష్మణ్‌గౌడ్ ఈనెల 16న గడ్డి మందును తా గి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టు ప క్కల వారు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందా డు. కు టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### వాట్సప్ లింక్ ఓపెన్ చేస్తే రూ. 2లక్షలు మాయం

నవాబుపేట: ఒక వ్యక్తికి వచ్చిన వాట్సప్ లింక్‌ను తెరవగానే అతని బ్యాంకు ఖాతాలో నగదు మాయమైంది. మండలానికి చెందిన నరేష్ గురువారం పీఎం కిసాన్ పేరుతో వాట్సప్ లింక్ వచ్చింది. దాన్ని క్లిక్ చేయగానే అతని ఖాతాల నుంచి వెంట వెంటనే రూ.2 లక్షల నగదు స్వాహా చేశారు. దీంతో తనకు వచ్చిన మెసేజ్ చూసుకుని జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వృద్ధ మహిళలే లక్ష్యంగా..

- మహిళతో కలిసి చోరీలకు పాల్పడుతున్న ఆటో డ్రైవర్
- వారం వ్యవధిలో రెండు ఘటనలు

మహబూబ్‌నగర్ క్రైం: వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని ఓ ఆటో డ్రైవర్ ఓ మహిళతో కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఆటో కోసం రోడ్లపై ఉండే ఒంటరి వృద్ధ మహిళలను ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లి ఒంటిపై ఉన్న బంగారం.. నగదు అపహరిస్తున్నారు. వారం వ్యవధిలో రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ సింహగిరికాలనీకి చెందిన అనంతమ్మ ఈ నెల 8న పింఛన్ డబ్బులు తీసుకోవడానికి పాత బస్టాండ్ దగ్గర ఉన్న బ్యాంకుకు వచ్చింది. కాసేపటి తర్వాత ఇంటికి వెళ్లడానికి రోడ్డుపై నిలబడగా.. ఆటో డ్రైవర్‌తో పాటు స్కార్ఫ్ కట్టుకొని ఉన్న ఓ మహిళ ఆటోలో వచ్చి రోడ్డుపై ఉన్న అనంతమ్మను ఎక్కించుకొని నవాబ్‌పేట మార్గంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి ఒంటిపై ఉన్న సుమారు రెండు తులాల బంగారు నగలు, కొంత నగదు తీసుకొని చెట్ల పొదల్లో పడేసి వెళ్లారు. అనంతరం అనంతమ్మ ఇబ్బందులు పడుతూ ఇంటికి చేరుకుంది. ఈ నెల 11న వెల్కిచర్లకు చెందిన భారతమ్మ ప్రేమ్‌నగర్‌లో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లడానికి మహబూబ్‌నగర్ కొత్త బస్టాండ్‌కు వచ్చింది. అదే ఆటోడ్రైవర్ ఆమెను ఆటోలో ఎక్కించుకుని ఫతేపూర్ వైపు తీసుకెళ్లి ఏడు మాసాల బంగారం, కొంత నగదు లాక్కొని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటనలపై టూటౌన్ సీఐ ఏజాజుద్దీన్‌ను వివరణ కోరగా.. రెండు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు. సీసీ కెమెరాలతో పాటు ఆటోల సీరియల్ నంబర్లు సైతం పరిశీలిస్తున్నామన్నారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు అప్రమత్తంగా ఉండాలని.. ఏదైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

## రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం


ఎద్దులబండిపై మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ సంతోష్ తదితరులు

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

కొల్లాపూర్ రూరల్: రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని రామాపురం రైతువేదికలో రైతులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం రైతులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని, మొదటి విడతగా గురువారం రూ.లక్షలోపు రుణాలు మాఫీచేసి శ్రీకారం చుట్టారన్నారు. రైతుల పక్షాన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందన్నారు. ఆర్థికంగా ఒడిదుడుకులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణమాఫీపై కీలక నిర్ణయం తీసుకుందని.. దీంతో రైతులు అప్పుల భారం నుంచి బయటపడతారని వివరించారు. ప్రజా ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తోందని.. అధికారంలోకి ఇచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పరిధిలోని రూ.10 లక్షలకు పెంచడం, గృహజ్యోతి పథకం, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేశామని వివరించారు. అనంతరం గ్రామరైతులు ఎద్దులబండిపై మంత్రిని ఊరేగించారు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణయ్య, డైరెక్టర్లు రఘుపతిరావు, పసుపుల నర్సింహ, ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, మండల వ్యవసాయ అధికారి రమేష్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మేకల నాగరాజు, ఇక్బాల్, బాలరాజు, కౌన్సిలర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ 3డే లీగ్‌లో సంచలనం


ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టుతో రాజశేఖర్ తదితరులు

- తొలి మ్యాచ్‌లో పాలమూరు విజయం
- 204 పరుగుల తేడాతో సాయి సత్య జట్టుపై గెలుపు
- క్రీడాకారులను అభినందించిన ఎండీసీఏ

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ 3డే లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సంచలనం నమోదు చేసింది. 2022లో 3డే లీగ్‌లో జిల్లా జట్టుకు చోటు దక్కినా ఒక్కటే మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. ఈ ఏడాది హెచ్‌సీఏ 3డే లీగ్‌లో తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా జట్టుకు చోటు లభించడం విశేషం. హైదరాబాద్‌లో ఏ–1 3డే లీగ్ డివిజన్‌లో జిల్లా జట్టు మొదటి మ్యాచ్‌లో గురువారం సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది.

**శుభారంభం..**

హైదరాబాద్‌లోని స్టంప్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన హెచ్‌సీఏ 3డే లీగ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు 204 పరుగుల తేడాతో సాయి సత్య క్రికెట్ క్లబ్ జట్టుపై విజయం సాధించి శుభారంభం చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో జిల్లా జట్టు 69.1 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ కాగా సాయి సత్య క్రికెట్ క్లబ్ జట్టు 54 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌట్ అయింది. మూడోరోజు గురువారం జిల్లా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. జట్టులో కెప్టెన్ గణేష్ అర్ధ సెంచరీతో రాణించాడు. 55 బంతుల్లో 7 ఫోర్లతో 56 పరుగులు చేయగా కాశీం 25, ఎ.శ్రీకాంత్ 24 పరుగులు చేశారు. సాయి సత్యజట్టు బౌలర్లు బాలాజీ 4, రోషన్ 3 వికెట్లు తీశారు. అనంతరం 320 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన సాయి సత్యక్రికెట్ జట్టు 32.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ శ్రీకాంత్‌యాదవ్ మరోసారి మెరుగైన బౌలింగ్ చేసి 10 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి కీలకమైన 4 వికెట్లు తీశాడు. షాదాబ్ అహ్మద్ 4.5 ఓవర్లలో 24 పరుగులకు 3 వికెట్లు, జైసింహ 2, గణేష్ 1 వికెట్ తీశాడు.

**ఎండీసీఏ అభినందనలు**

ఉమ్మడి జిల్లా జట్టు 3డే లీగ్‌లో మొదటి విజయాన్ని సాధించడంపై మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ఎండీసీఏ) ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోశాధికారి ఉదేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా అభినందించారు. రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్‌సీఏ త్రిడే లీగ్‌లో తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు అవకాశం దక్కిందని, అందులో మొదటి మ్యాచ్‌లోనే జిల్లా జట్టు గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. 3డే లీగ్‌లో క్రీడాకారులకు సువర్ణ అవకాశం అని, ఇదే స్ఫూర్తితో ఆడుతూ రానున్న మ్యాచుల్లో మరిన్ని విజయాలు నమోదు చేయాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టులో బ్యాటింగ్, బౌలింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన షాదాబ్ అహ్మద్‌కు ఎండీసీఏ కోశాధికారి ఉదేష్‌కుమార్ ప్రోత్సాహకంగా రూ.22 వేల విలువ గల బ్యాట్‌ను బహూకరించారు.

## చిరుతదాడి నుంచి తప్పించుకున్న లైన్‌మన్

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్‌మన్ పరమేశ్వర్ తృటిలో చిరుత దాడి నుంచి తప్పించుకున్నాడు. గురువారం విధుల్లో భాగంగా జంగమాయపల్లి నుంచి అడవి దారిలో మామిడిమాడ తండాకు వస్తుండగా మార్గమధ్యలో చిరుత ఆయన దగ్గరకు వస్తూ కనిపించింది. ఒక్కసారిగా తన బైక్‌ను వేగంగా నడుపుతూ తండాకు వచ్చాడు. తండా వద్ద మనుషులు కనిపించిన తర్వాత ఊపిరి పీల్చుకున్నాడు. ఈ దారి వెంట వెళ్లే వారికి తరుచుగా చిరుత కనిపిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఫారెస్టు అధికారులు చిరుతను పట్టుకుని తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎల్కిచర్లలో దూడపై దాడి


దూడను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

భూత్పూర్: చిరుత దాడిలో దూడ మృతిచెందిన ఘటన భూత్పూర్ మండలం ఎల్కిచర్ల సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎల్కిచర్లకు చెందిన తిరుపతి రెడ్డి పొలంలో దూడపై చిరుత దాడి చేయడంతో మృతిచెందింది. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో సెక్షన్ ఆఫీసర్ నిరంజన్, బీట్ ఆఫీసర్ రాఘవేందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో పాదముద్ర కన్పించడంతో చిరుత అని అధికారులు ధ్రువీకరించారు. పశువైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించి దూడను పూడ్చివేశారు. చిరుత రాత్రి 12 గంటల తర్వాత తిరుగుతుందని, తెల్లవారుజామున 4 గంటల వరకు తన స్థావరం దగ్గరకు వెళ్తుందని బీట్ ఆఫీసర్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

**భయాందోళనలో గ్రామస్తులు**

చిరుత సంచరిస్తుండడంతో భట్టుపల్లి, ఎల్కిచర్ల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు జంకుతున్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు బట్టుపల్లి సమీపంలో ఉండటంతో ప్రాజెక్టు ప్రాంతం నుంచి చిరుత పులి వచ్చి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.